క్లుప్తంగా

జాయింట్ ఐడెంటిఫికేషన్



గద్వాల న్యూటౌన్: గద్వాల మున్సిపాలిటీ పరిధిలో మైనార్టీ కార్పొరేషన్ కింద వ్యక్తిగత రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంగళవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సంయుక్త గుర్తింపు(జాయింట్ ఐడెంటిఫికేషన్) నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ నర్సింహా, వివిధ బ్యాంక్‌ల బ్రాంచ్‌ల అధికారులతో కలిసి లబ్ధిదారుల ధ్రువపత్రాలు పరిశీలించారు. ఏర్పాటు చేసుకున్న వ్యాపార వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వివిధ బ్యాంక్ బ్రాంచ్‌ల అధికారులు అన్వర్, ఎండీ సుభాన్ మియ్య, జయప్రకాష్, గౌరవ్ దేశ్ ముఖ్, బాబు, వేణుగోపాల్, రాంమోహన్‌గౌడ్, మెప్మా ఏడీఎంసీ వెంకటేశ్వర్లు, టీఎంసీ శ్రీకర్, నిజాముద్దీన్, మహాలక్ష్మి, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

మల్దకల్: భూ రిజిస్ట్రేషన్ల కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దని తహసీల్దార్ హరికృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూ రిజిస్ట్రేషన్లు సజావుగా కొనసాగుతున్నాయి. వివిధ గ్రామాలకు చెందిన రైతులు మీ సేవా కేంద్రాలలో ధరణిలో స్లాట్ బుక్ చేసుకోగా వారికి తహసీల్దార్ రిజిస్ట్రేషన్ నిర్వహించారు. అనంతరం భూ దస్తావేజులు అందజేశారు.

ప్లీనరీకి తరలిన ఫొటోగ్రాఫర్లు



ధరూరు: తెలంగాణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శిల్పారామంలో జరుగుతున్న ప్లీనరీ సమావేశానికి మండల ఫొటో, వీడియో గ్రాఫర్లు తరలివెళ్లారు. జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు శేఖర్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్, సుధాకర్‌రెడ్డి, రమేష్, శ్యాం, రాజు, శివ తదితరులు తరలిన వారిలో ఉన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభం



మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో మంగళవారం ప్రమాదవశాత్తు చెత్త ట్రాక్టర్ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది. ఈ ఘటనలో ఎవరికి ఏ ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. విద్యుత్ స్తంభాలు, నివాసగృహాలపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. పాక్షికంగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ విషయమై ఏఈ అహ్మద్‌ను అడగగా బుధవారం స్తంభాన్ని మార్చి విద్యుత్ తీగలు సరిచేస్తామని పేర్కొన్నారు.

పూడికతీత పనులు పరిశీలన

గద్వాల అర్బన్: మండలంలోని ముల్కాల్‌పల్లిలో మంగళవారం ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ రవీంద్ర పరిశీలించారు. గ్రామ పంచాయతీ పరిధిలో రైతుల పొలాలకు వెళ్లే కాలువలకు సంబంధించిన పూడికతీతను ఉపాధి హామీ కూలీలు తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కూలీలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఓ శివజ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ రామచంద్రుడు తదితరులు ఉన్నారు.

బస్సును ఢీకొట్టిన ద్విచక్రవాహనం

శాంతినగర్: పట్టణ బస్టాండ్ సమీపంలో వెళ్తున్న పైపాడు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ బస్సును ఢీకొట్టి కిందపడ్డాడు. అదే సమయంలో అటు వైపుగా వెళ్తున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్ బాధితుడిని చెట్టు నీడకు తీసుకెళ్లి 108కు ఫోన్ సమాచారం ఇచ్చాడు. అంబులెన్స్ రాక ఆలస్యం అవుతోందని భావించి ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి వైద్యానికి అయిన ఖర్చును చెల్లించి మానవత దృక్పథం చాటుకున్నాడు.

‘ఉపాధి’కి కూలీల కొరత

● మేటీలతోనే పనులు



మెన్నిపాడులో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ(ఫైల్)

ఉండవెల్లి: ఉపాధి హామీ పథకంపై అధికారులు అవగాహన కల్పించాల్సిన ఉన్నా పట్టించుకోకపోవడంతో కూలీల కొరత ఏర్పడింది. దీంతో ఉపాధి హామీ పథకం లక్ష్యం నీరుగారుతోంది. పలు గ్రామాల్లో ఉపాధి కూలీల కొరత అధికంగా ఉంది. పంట పొలాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉపాధి పనులు చేసేందుకు మొగ్గు చూపడం లేదు. ఉపాధి హామీ పనులు ముమ్మరంగా చేపట్టిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా కూలీలు పనులకు రావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధి పనులకు వస్తే రోజు వారి కూలీ రూ.272 లు చెల్లిస్తారు. అదే పంట పొలాలకు వెళ్తే మధ్యాహ్నం వరకు రూ.250లు వస్తాయని కూలీలు పేర్కొంటున్నారు. వివిధ గ్రామాల్లో మేటీలే పనులు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

16 పంచాయతీలకు 10 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు

మండలంలో 16 గ్రామ పంచాయతీలకు 10 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండగా అందులో 6 మంది సీనియర్ మేటీలే ఉపాధి పనుల విధులు నిర్వహిస్తున్నారు. ఉండవెల్లి, కంచుపాడు, చిన్న ఆముదాలపాడు, శేరుపల్లె, బస్వాపురం, పుల్లూరు, మెన్నిపాడు, బొంకూరు, కలుగోట్ల, ఏ.బూడిదపాడు గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండగా, మారమునగాల-1, మారగమునగాల-2, తక్కశిల, ప్రాగటూరు, బైరాపురం, ఇటిక్యాలపాడులో ఫీల్డ్ అసిస్టెంట్లు లేక సీనియర్ మేట్లతో ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు.

పనులను పర్యవేక్షిస్తున్నాం..

ఉపాధి పనులు ప్రారంభంలోనే కూలీల సంఖ్య పెంచలేం. కూలీలు పంట పొలాల్లో పనులు పూర్తి అయిన వెంటనే ఉపాధి పనులకు వస్తారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్న చోట, సీనియర్ మేటీలు ఉన్న చోట కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. వివిధ గ్రామాలలో చేపట్టిన ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్నాం.

–విజయ్ శంకర్, ఏపీఓ, ఉండవెల్లి

అగ్నికి ఆహుతైన పంటల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

శాంతినగర్: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని అగ్నికి ఆహుతైన మొక్కజొన్న పొలాలను ఎస్ఐ శ్రీనివాసులు, ఏఓ రాధలు మంగళవారం పరిశీలించారు. వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల గ్రామ శివారులో వెంకటాపురం గ్రామానికి చెందిన ఈరన్న మూడెకరాలు, తనగలకు చెందిన పెద్దసవారి 1.5 ఎకరాలు, చిన్న సవారి 3 ఎకరాలు, అయ్యపురెడ్డి రెండెకరాలు, శేఖర్‌రెడ్డి రెండెకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశారు. సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కోత దశలో ఉన్న పంటలు కాలి బూడిదయ్యాయి. అధికారులు గ్రామానికి చేరుకొని మొక్కజొన్న పొలాలను, కాలిన డ్రిప్, బోర్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లను పరిశీలించారు. సమీపంలోని రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారి ఖాజా, రైతులు ఉన్నారు.

నిందితుడికి జైలు శిక్ష

అలంపూర్ రూరల్: శింగవరం-2 గ్రామానికి చెందిన గుర్రం మద్దిలేటికి ఏడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ మహిందర్ పేర్కొన్నారు. మాంటిస్సోరి పాఠశాల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదానికి కారకుడైన మద్దిలేటిని కోర్టులో హాజరుపరచగా నిందితుడికి జడ్జి ఏడురోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి

మల్దకల్: విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఇమ్మానియేల్ కోరారు. మంగళవారం కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత విద్యను అభ్యసించాలని పేర్కొన్నారు. అదేవిధంగా విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పల్లెకు కమ్యూనిటీ హాల్



గువ్వలదిన్నెలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

కేటీదొడ్డి: మండలంలోని ప్రతి పల్లెకు కమ్యూనిటీ హాల్స్ నిర్మించేందుకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ మండల నాయకులు చక్రధర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇర్కిచేడు, గువ్వలదిన్నె, తూర్పుతండా గ్రామాలలో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి కాంట్రాక్టర్ తిమ్మారాజుతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపి, వెంకటేష్‌గౌడ్, గోపాల్ రెడ్డి, కన్నయ్య, వెంకటప్ప, తిమ్మప్ప, ఆంజనేయులు, పాల్గొన్నారు.

భగవద్గీతపై అవగాహన



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని పుటాన్‌దొడ్డిలో త్రైతసిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవాసమితి ఎర్రవల్లి కమిటీ సభ్యులు గ్రామంలోని ఇటింటికి తిరిగి భగవద్గీత ప్రాధన్యం వివరించారు. అనంతరం భగవద్గీత గంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు బీచుపల్లి, పరుశరాముడు, వంశీ, సువర్ణ, భాగ్యమ్మ తదితరులు ఉన్నారు.

పన్ను వసూలు చేయొద్దు

మానవపాడు: వివిధ గ్రామాలలో నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలలో పాల్గొనున్న వృషభ రాజాలకు పన్నులు వసూలు చేయొద్దని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అధికారులకు సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన బలప్రదర్శన పోటీలో పాల్గొనేందుకు వస్తున్న వృషభరాజాలకు చెక్ పోస్టుల వద్ద పన్నులు వసూలు చేస్తున్నారు. ఈ విషయం రైతులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే ఫోన్‌లో అధికారులతో మాట్లాడారు. రైతుల నుంచి పన్నులు వసూలు చేయొద్దని కోరారు.

బీఎస్పీ కార్యవర్గం ఎన్నిక



నియామక పత్రాన్ని అందిస్తున్న సభ్యులు

రాజోళి: మండల బీఎస్పీ నూతన కమిటీని అలంపూర్ నియోజకర్గ ఇన్‌చార్జ్ రవిచంద్ర ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన గంటిపోగు వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా రాజోళి వెంకటేష్‌లు, మండల కమిటీ, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కదిరింటి విజయ్ కుమార్, బోయ కృష్ణమూర్తి, హనోకు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

స్లోబైక్ రేస్ పోటీలు



మానవపాడు: మండల కేంద్రంలో ఈదమ్మ దేవర సందర్భంగా మంగళవారం స్లోబైక్ రేస్ పోటీలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పోటీలను తిలకించేందుకు యువకులు తరలివచ్చారు. పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా కొనసాగాయి. మొదటి బహుమతి దొడ్ల నాగరాజు నిలిచి రూ.5వేలు, రెండో బహుమతి పరుశురాముడు అందుకున్నారు. కార్యక్రమంలో కిశోర్‌కుమార్, జగ్గుల శివరాముడు, శివ, గంగాధర్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

ధరూరు: అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ధరూరు గ్రామానికి చెందిన దాదెపోగు మద్దిలేటి మంగళవారం మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల ప్రకారం సర్వే నంబరు 33/15లో 3 ఎకరాల19 గుంటల భూమి తాత సంపంగి నర్సన్న పేరుపై ఉంది. ఈ భూమి దోర్నాల గ్రామానికి చెందిన నవారన్న కుమారులు మాకు సంబంధించినదని ఫోర్జరీ సంతకాలతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆయన కన్నేస్తే కబ్జానే!

● అధికార పార్టీ కీలక నేతకు బంధువుగా చెలామణి

రాజోళి: మండలంలోని తుమ్మిళ్ల గ్రామానికి చెందిన పైరవీ కారు చెప్పిందే వేదం. ఆయన కన్నపడితే భూ కబ్జా కావల్సిందే. నకిలీ ఆధార్ కార్డులు సృష్టించి అధికారుల అండదండలతో అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేస్తాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూ ఆక్రమణలు మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రం గద్వాల వరకు విస్తరించాయంటే అతిశయోక్తి కాదు. వడ్డేపల్లి ఉమ్మడి మండలంగా ఉన్నప్పటి నుంచి ఆయన తన పంథాను కొనసాగిస్తున్నాడు. రాజోళి మండలం ప్రత్యేకంగా ఏర్పడిన తర్వాత ఆయన బంధువుల్లో ఉన్న అధికార పార్టీ నాయకులను ఆసరాగా చేసుకుని అక్రమ రిజిస్ట్రేషన్లు, భూకబ్జాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. వడ్డేపల్లి మండలంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకుడికి దగ్గరి బంధువునని భూ కబ్జాలకు తెరలేపాడని పలువురు ఆరోపిస్తున్నారు.

పైరవీ చేస్తే పనికావాల్సిందే..

ఆయన తరపున ఏదైనా పైరవీ వచ్చిందంటే తహసీల్దార్ కార్యాలయంలో పని చేయాల్సిందే. అందులో తప్పులున్నా, ఒప్పులున్నా, వారే సరి చేసుకోవాల్సిందే. కాదంటే అన్ని పార్టీల నాయకుల నుంచి అధికారులకు ఒత్తిడి తప్పదు. అన్ని పార్టీల నాయకులను, ప్రజాసంఘాల నాయకులను, అధికారులను గుప్పిట్లో ఉంచుకొని కబ్జాలకు పాల్పడుతున్నట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

- 2021 లో పచ్చర్ల శివారులో ఉన్న భూమిని యజమానికి తెలియకుండా ఇతరుల ఆధార్ కార్డును ఉపయోగించి రిజిస్ట్రేషన్‌లు చేయించాడు. బాధితులు అధికారులకు ఫిర్యాదు చేయగా న్యాయం జరిగింది.
- తాజాగా మండలంలోని పచ్చర్ల శివారులో రెండు ఎకరాల 30 గుంటలు భూమిని కాజేసేందుకు యత్నం.
- పలు కారణాలతో రిజిస్ట్రేషన్ కాని భూమిని తన కుమారుడి పేరుపై 5 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ అయ్యింది.

తహసీల్దార్ వివరణ

తుమ్మిళ్ల గ్రామానికి సదరు వ్యక్తి ఆగడాలపై తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మను వివరణ కోరగా, ఆయన ద్వారా ఎవరైనా ఇబ్బందులు పడితే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గతంలో కార్యాలయానికి తరుచూ వచ్చి వెళ్లి వచ్చే వారని ఈ మధ్యకాలంలో పైరవీకారుడు రావడం లేదని వివరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ధరూరు: మండలంలోని మన్నాపురం మాజీ సర్పంచు కుర్వ పెద్ద భీమన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అదేవిధంగా మండలంలోని మాల్‌దొడ్డి గ్రామానికి చెందిన బోయ కృష్ణ బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆయా గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఆమె వెంట గడ్డం కృష్ణారెడ్డి, రామాంజనేయులు, రాజేష్, హన్మంతరాయ పాల్గొన్నారు.

గట్టు: బీజేపీ మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి గుండె ఆపరేషన్ చేసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మంగళవారం బాధితుడిని పరామర్శించారు. శివారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలని ఆమె సూచించారు. ఆమె వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం కృష్ణారెడ్డి, నాయకులు మధుసూదన్‌రావు, రామాంజనేయులు, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు

ధరూరు: ఉపాధి కూలీలకు పని చేస్తున్న ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శివారు పొలాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో ఆమె కాసేపు ఆగి ముచ్చటించారు. గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు పని చేస్తున్న ప్రాంతాల్లో విధిగా చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం, మెడికల్ కిట్లు వంటి వాటిని ఏర్పాటు చేశారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రామాంజనేయులు, పెద్దపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ధరూరులో ధర్నా చేస్తున్న మండల వీఏఓలు



మల్దకల్ మహిళా సమాఖ్య ఎదుట ..



గట్టులో సమ్మె చేస్తున్న వీఓఏలు

గద్వాల అర్బన్: ఐకేపీ వీఓఏలను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మెప్మా కార్యాలయం ఎదుట ఐకేపీ వీఓఏలు సమ్మె చేపట్టారు. సమ్మెకు ఆయన మద్దుతు తెలిపి మాట్లాడారు. ఐకేపీ వీఓఏలతో వెంటనే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో వీఓఏల మండల అధ్యక్షుడు తిమ్మప్ప, కార్యదర్శి తులసీ, రాధమ్మ, కృష్ణవేణి, రేణుక, వెంకటేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉప్పేరు నర్సింహ్మ తదితరులు ఉన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట సమస్యల పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వీఓఏలు ధర్నా నిర్వహించారు. వీఓఏలను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాం అంజి, భీమేష్, భాగ్యలక్ష్మి, పావని, రూతమ్మ, సత్యనారాయణమ్మ, సరస్వతి, సుమిత్ర, తిమ్మప్ప, శివన్న తదితరులు పాల్గొన్నారు.

గట్టు: వివిధ గ్రామాలకు చెందిన వీఓఏలు మహిళా సమాఖ్య భవనం ఎదుట మంగళవారం సమ్మె నిర్వహించారు. సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీ నర్సింహ సందర్శించి, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వీఓఏలు ఆలూరు వెంకటేష్, వీరన్న, భాస్కర్, రవిచంద్ర, తప్పెట్లమొర్సు వీరన్న, వీరేష్‌గౌడ్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: వీఓఏలను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని వివిధ గ్రామాలకు చెందిన వీఓఏ సంఘం మండల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వీఓఏలు మండల మహిళా సమాఖ్య భవనం ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు బాషా, చంద్రాములు, అపర్ణ, మహేందర్, లోకనాథ్, మునిస్వామి, హనుమంతు, వెంకట్రాములు, చెన్నమ్మ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘కంటి వెలుగు’



గట్టులో కంటి పరీక్షలు పర్యవేక్షిస్తున్న అధికారులు

గట్టు: మండలంలోని ఆరగిద్ద, ఇందువాసి గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయి. మంగళవారం రెండు గ్రామాల్లో వైద్యులు కంటి పరీక్షలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మొత్తం 292 మంది కంటి పరీక్షలను చేయించుకున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఇందులో 15 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయగా, 14 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, నర్సింహులు, హెల్త్ సూపర్‌వైజర్లు మక్బూద్, స్వర్ణలత, ఏఎన్ఎంలు నర్మద, ఖేజా, ఈశ్వరమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అయిజ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య కోరారు. మంగళవారం 15వ వార్డులో అధికారులు, ప్రజాప్రతినిధులు కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలోని ఒక్కొక్క వార్డులో ఐదు రోజులు మొత్తం 20 వార్డుల్లో 100 రోజులపాటు శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వివిధ వార్డుల కౌన్సిలర్లు, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ సుధారాణి, పీహెచ్‌సీ స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన ఎమ్మెల్యే



ఎమ్మెల్సీ చల్లాతో ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి

అలంపూర్: ఎమ్మెల్సీ చల్లా వెకంట్రామిరెడ్డిని కొల్లాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి కర్నూల్‌లోని ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు పుష్పగుచ్ఛం ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు. అదేవిధంగా పుల్లూరు గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు రవిశంకర్, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ చల్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపాధ్యాయుడు రవిశంకర్ విద్యా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా వినూత్న బోధన పద్ధతితో జాతీయ స్థాయికి ఎన్నిక కావడంతో ఎమ్మెల్సీ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో అలంపూర్, గద్వాల రెడ్డి సంఘం నాయకులు, అలంపూర్ సంతమార్కెట్, న్యూప్లాట్స్‌కు చెందిన పలువురు ఉన్నారు.

నీటి వృథాను అరికడదాం



మురుగు కాలువలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న

అయిజ: మున్సిపాలిటీలో మిషన్ భగీరథ నీరు వృథాను కలిసికట్టుగా అరికడదామని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని 14వ వార్డులోని బలిజపేట, ఉప్పలదొడ్డిపేట, కొత్తపేట కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మిషన్ భగీరథ నీటి సరఫరా కాకపోవడంతో పట్టణ ప్రజలు నాలుగు రోజులపాటు అనేక ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. నీటి వృథా కాకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. మురుగు కాలువల్లో చెత్తను వేయొద్దని కోరారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ లైన్‌మెన్ నరసింహులు, బిల్ కలెక్టర్లు నరేష్, అడివన్న, మహేంద్రనాథ్, నాగరాజు, ఆంజనేయులు, వీరేష్, మధు, అశోక్, జవాన్లు ప్రకాష్, ఆనంద్, ఎలక్ట్రీషియన్లు సురేష్, జయరాములు, అటెండర్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.